వనజ భర్త బాగా చదువుకున్నవాడు. ఇంజినీరింగు డిగ్రీ, మేనేజిమెంటు సైన్స్‌లో పి.జి. డిగ్రీ చేశాడు. చాలా అందంగా హుందాగా వున్నాడు. సొంత ఫ్యాక్టరీ వుంది. చక్కని వ్యక్తిత్వం ఉన్నవాడు. వనజకు మంచి భర్త దొరికినందుకు చాలా సంతోషించాను. ఆ విషయం ఆమెకు చెప్పేశాను కూడా.

'ఇతడు నీలాగ కాదు!' ఆమె చిలిపిగా చెబుతూ పకపక నవ్వేసింది. అతడు ఏదో చెప్పబోయాడు. 'ఆగు! గొప్పలు చెప్పుకోకు! నీకు స్త్రీ శరీరమే కాని "స్త్రీ" అక్కర్లేదు!' ఆమె నవ్వుతూ చిలిపిగా చెప్పేసింది. ఆమె మాటలు విన్నాక అతడు మరీ ఉత్సాహంగా కనిపించేడు!

ముహూర్త మధురక్షణం దగ్గర పడుతోంది. ఎంత ఆహ్వానించినా సృజన నా మనసులో ప్రవేశించి మధురమైన ప్రేమమయ శృంగారభావజాలంతో నా మనసును నింపలేకపోయింది! అది ఆమె తప్పుకాదు. అది నా లోపం!

తల్లిదండ్రులకు దూరంగా, కుటుంబ సభ్యులకు దూరంగా స్నేహితులకు దూరంగా, విశాఖకు దూరంగా ఒంటరిగా వున్న నేను కామాన్ని రెచ్చకొట్టే నీలిబొమ్మలు చూసే దుర్వ్యసనానికి గురైపోయాను! బలైపోయాను! సృజన నా మనసులో మెదిలినప్పుడల్లా, నీలిబొమ్మలు తెరలు తెరలుగా నా కళ్ళముందు రంగురంగుల చిత్రాల్ల కదులుతున్నాయి! స్త్రీ పురుషులు నగ్నంగా కలవడం - శరీరంలోని ప్రతి అంగం, అవయవం స్పష్టంగా నా కళ్ళముందు దృశ్యంలా కదులుతున్నాయి! స్త్రీ పురుషుల కలయికలో ప్రతి కామ చర్య ప్రతి కదలికా- స్పష్టమైన దృశ్యంలా నా కళ్ళముందు మెదులుతున్నాయి. అవన్నీ నా కామాన్ని మాత్రమే రెచ్చకొడుతున్నాయి. సృజనలోని ప్రేమమయ శృంగారభరితమైన స్త్రీ నా మధురభావనలోకి రాకుండా నీలి చిత్ర దృశ్యాలు అడ్డుకుంటున్నాయి!

పదకొండు గంటల అయిదు నిమిషాలు అయిపోయింది. తలుపు నెమ్మదిగా చప్పుడైంది. సృజన మెత్తగా అడుగులు వేసుకుంటూ, యవ్వనపు పరిమళాన్ని వెదజల్లుతూ గదిలోకి వచ్చి తలుపు మూసివేసింది. ప్రేమమయ శృంగారపు చిరునవ్వుల వెన్నెలతో గదిని నింపేస్తోంది.

మరి నేను!?

ప్రేమ లేదు! శృంగారం లేదు! ప్రేమమయ శృంగారం లేదు!

కామం! కామం! ఒళ్ళు తెలీని కామం! పశుకామం!

నీలి బొమ్మల దృశ్యాలు వడివడిగా నా కళ్ళముందు కదులుతున్నాయి!

నీలి బొమ్మలు చాలా హానికరమైనవని తెలుసుకుంటున్నాను!

నీలి బొమ్మలు యువకులను నిజమైన ప్రేమమయ శృంగార సంసార జీవితానికి దూరం చేస్తాయని తెలుసుకుంటున్నాను!

స్త్రీ శరీరమేకాని 'స్త్రీ' అక్కర్లేని యువకులను నీలి బొమ్మలు తయారుచేస్తున్నాయి!

ఇవాళ మన వెండితెర - బుల్లితెర - కూడా నీలి చిత్రాల్లా వుంటున్నాయి! డబ్బే కాని సమాజం పట్ల ప్రేమా బాధ్యతా లేని నేరస్తులే వారంతా!

★ ★ ★

(సుప్రభాతం - వారపత్రిక - 27.01.2001)

# చిత్తు కాగితాలు

అప్పలరాజు, బంగార్రాజు వొకే వూళ్లో పుట్టి పెరిగేరు. ఇద్దరూ ఆ వూరి బడిలో అయిదోక్లాసు వరకూ కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత యిద్దరూ నర్సీపట్నం హైస్కూల్లో చేరారు. స్కూలుకి దగ్గరగా వున్న వో యింట్లో వీధి అరుగుమీద చిన్న గది అద్దెకు తీసుకున్నారు. అక్కడికి దగ్గర్లోని 'రాజుల బ్రాహ్మణ భోజనశాల'లో భోజనానికి ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరూ చెరోసగం పెట్టి పాత సైకిలు కొన్నారు. ఇద్దరూ కలిసి వారానికోసారి సొంతవూరు వెళుతూ వుండేవాళ్లు.

అప్పలరాజు తండ్రికి మూడెకరాల మెట్టభూమి వుంది. వేరుశనగా, నువ్వులూ పండిస్తూ వుంటాడు. అతడికి నూనె ఆడే గానుగ కూడా వుంది. వేరుశనగ - నువ్వులూ కలిపి ఆడి నూనె - తెలగపిండి అమ్ముతూ వుంటాడు. అంతేకాకుండా కుంచానికి బేడ చొప్పున పుచ్చుకుంటూ ఆ వూరి వాళ్ళకీ పై ఊరు వాళ్ళకి కూడా నూనె ఆడి యిస్తూ వుంటాడు. వూరికి వెళ్ళినప్పుడల్లా అప్పలరాజు సీసాతో నూనె పట్టుకు వస్తాడు. ఇద్దరూ ఆ నూనె భోజనంలోనే కాకుండా తలకు కూడా వాడుతారు..

బంగార్రాజు తండ్రి సొంత వూళ్లోనే వున్న బడిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడికి కూడా రెండెకరాల మెట్టభూమి వుంది. అతడు కూడా వేరుశనగ నువ్వులూ పండిస్తాడు. ఆ రెండూ కలిపి నూనె ఆడిస్తాడు. అయితే - అదంతా యింట్లోనే ఖర్చయిపోతూ వుంటుంది. రోజూ కూరగాయలు కొనుక్కునే స్తోమత లేక సంవత్సరానికి సరిపడా ఆవకాయ పెడుతూ వుంటారు. వూళ్లో ఎవరికి వొంట్లో బాగా లేకపోయినా - 'నాలిక సచ్చిపోయింది. ఆవకాయ బద్దపెట్టరా!' అని అడుగుతూ వుంటారు. అంచేత - ఆవకాయ చాలా ఎక్కువగా పెడుతూ వుంటారు. బంగార్రాజు వూరికి వెళ్ళినప్పుడల్లా సీసాతో ఆవకాయ పట్టుకు వస్తాడు. ఇద్దరూ వాడుకుంటూ వుంటారు. అప్పలరాజు లేత తెలకపిండి తెస్తూ వుంటాడు. బంగార్రాజు బెల్లంకొంటూ వుంటాడు. ఆ రెండూ కలిపి సాయంకాలం అల్పాహారంగా సేవిస్తూ వుంటారు. ఆ విధంగా యిద్దరూ కలిసి చాలా స్నేహంగా చదువు సాగిస్తున్నారు. ఇద్దరూ ఎనిమిదోక్లాసు పాసై తొమ్మిదిలో చేరారు. ఆ కాలంలో ఆ వూళ్లో అగ్నిప్రమాదం జరిగి వూరంటుకు పోయింది. గానుగెద్దును మంటల్లోంచి విడిపించడానికి అప్పలరాజు తండ్రి తెగించి మంటల్లోకి దూకాడు. ఆ మంటల్లో ఎద్దుతోపాటు - అతడు కూడా మరణించాడు. ఆ

కుటుంబం దిక్కులేనిదైపోయింది. బంగార్రాజు తండ్రీ మరి కొందరూ కొంతకాలం కొద్దిగా ఆదుకున్నా, వాళ్లు కూడా యిబ్బందుల్లో వున్నవాళ్లే. అప్పల్రాజు చదువు మానేశాడు. 'నువ్వు తోడులేకుండా బడికి వెళ్లలేకపోతున్నాను! నేనూ బడి మానేస్తాను!' అని బంగార్రాజు కంట తడిపెడ్తూ చెప్పాడు. 'ఒద్దు! అలా చేయొద్దు! నాకోసం నువు చదువు మానేస్తే నాకెంతో బాధగా వుంటుంది! నువ్వైనా పెద్ద చదువు చదివి పెద్ద ఉద్యోగం చేయాలి! నువ్వు చదువు మానేస్తే నా మీద ఒట్టే!' అని అప్పల్రాజు చెప్పాడు. కొంతకాలం బడి మానేసినా ఆ తర్వాత బంగార్రాజు చదువు సాగిస్తున్నాడు.

★ ★ ★

విశాఖపట్నం నుంచి అప్పల్రాజు మేనమామ వచ్చాడు. అతడు విశాఖలో స్థిరపడిపోయాడు. మాధవధార కొండకు దిగువగా సొంతదైన పాకయిల్లు వుంది. ఎడ్లబండి వుంది. ఇసుక - రాయి - మట్టి లాంటివి బండిమీద తోలుతూ జీవితాన్ని గడుపుతున్నాడు. బాగా కష్టపడి పనిచేస్తూ జీవితంలో నిలదొక్కుకున్నాడు. తన యింటికి దగ్గరగా చిన్న యింటి జాగా కూడా కొన్నాడు. అతడికి వొక్కడే కొడుకు. ఆ తర్వాత పిల్లలు పుట్టలేదు. అతడు అక్కనీ పిల్లల్నీ విశాఖ తీసుకువెళ్ళిపోవడానికి వచ్చాడు.

'ఓలప్పా! వొక్కిత్తివే యిక్కడెలాగుండగలవు! ఏలుండాల? నిన్నూ పిల్లల్నీ తీసుకెల్లిపోవడానికి బైలెల్లి వొచ్చాను. ఇక్కడేముంది మనకి బావపోనాక? ఆ గరువుముక్క ఏదో అమ్మేసుగుని పోదాం. ఇక్కడుంటే కుర్రోడికి ఏపని దొరుకుతాది? మా యింటికి పొలిమేరలో నేబరు కంటురాట్టు మేస్త్రిరున్నాడు. మంచోడు. మంచి పేరున్నోడు. ఇప్పటికే రెండొందల యిళ్ళు కట్టించాడు. కుర్రోణ్ణి ఆ బాబుకాడ పడేస్తాను. కొంతకాలం కూలిపని సేత్తే, ఆ తర్వాత తాపీ పట్టిస్తాడు. తాపీ మేస్త్రిరి అయిపోతాడు. బతుకులో నిలదొక్కుకుంటాడు. బాగుపడతాడు. మనకే బెంగా వుండదు. నాను సిన్న యింటిజాగా కొనుంచినాను. గరువు ముక్క అమ్మిన డబ్బుతో మీకోసం అక్కిడ సిన్న యిల్లు నిలబెడతాను. నీ కూతురంటావా - అది నీ కూతురు కాదు ! నా కోడలే అనుకో! నాకూ వొక్కిడే గుంటడు కదా! ఇక్కిడ వొక్కిత్తివే వుంటే నాకు బెంగగా వుంటాది. వొణ్ణం ముద్ద గొంతుక దిగదు! ఓలప్పా! నా మాట కాదనకు. ఇక్కడి పనులు సక్కబెట్టుకుని వోరంలోపున ఎల్లిపోదాం' అని అతడు అన్ని విషయాలూ స్పష్టంగా చెప్పాడు. ఆమె వొప్పుకుంది. కొడుకు